
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల వివిధ ఆసుపత్రుల నందు వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి రూ.7,07,100 మంజూరయ్యింది. ఆ చెక్కులను ఆదివారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రామచంద్రాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లమిల్లి సత్య నారాయణరెడ్డి, మేడపాటి రవీంద్రరెడ్డి, మేక జెజిబాబు, నల్లమిల్లి వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు లేని బీ(ధీ)మా..

- ఖరీఫ్‌ను ముంచేసిన మొంథా
- గాల్లో దీపంగా రైతుల పరిస్థితి



ఇటీవల వచ్చిన మొంథా తుపానుకు కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్టలో నీట మునిగిన వరి చేలను చూపుతున్న రైతు

ప్రజాశక్తి- అమలాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంటల బీమాను దూరం చేశాయి. ప్రకృతి విపత్తుల నేపథ్యంలో పంటల బీమా ద్వారా గతంలో కొంత ఊరట లభించేది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమాకు మంగళం పలికిన విషయం విదితమే. రైతులనే బీమా చెల్లించుకోవాలని చెప్పడంతో అత్యధిక మంది రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో బీమా ప్రీమియం చెల్లించలేదు. తాజాగా ఖరీఫ్ రైతులను మొంథా తుపాను ముంచేసి వెళ్లిపోయింది. జిల్లాలో వ్యవసాయ పంటల్లో వరి 55,115 ఎకరాలలో నేలనంటగా, 21,594 ఎకరాలు నీట మునిగింది. మొత్తం 76,709 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఉద్యాన పంటలకు సంబంధించి 3,935 ఎక రాల్లో నష్టం జరగగా, దీనిలో ఒక్క అరటి పంటే 3,879 ఎకరాలు ఉంది. జిల్లాలో 1,66,281 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు జరగగా కేవలం 44,201 ఎకరాలు మాత్రమే బీమా పరిధిలో ఉన్నాయి. రుణాలు తీసుకున్న వారికి ఆయా బ్యాంకులు తప్పనిసరిగా బీమా చేయించాయి. మిగిలిన రైతులు ఈ అవకాశాన్ని పొందలేకపోయారు. ఇలా బీమా పరిధిలో లేని వారిలో 80 శాతం కౌలుదారులు. మొత్తం ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు 1,12,067 మంది. రుణం తీసుకుని బీమా పొందినవారు 58,914 మంది రైతులు కాగా, సొంతంగా బీమా చేయించుకున్న రైతులు 2,893 మంది మాత్రమే. మిగిలిన 40,260 మందికి బీమా లేదు.ఉద్యాన పంటలకు సంబంధించి జిల్లాలో సుమారు 1.53 లక్షల ఎకరాలు ఉండగా, సొంతంగా బీమా చేయించుకున్న రైతులు పది శాతం కూడా లేరు. ప్రస్తుతం పంటనష్టపోయిన వారికి పరిహారం ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంటల బీమా పథకాన్ని ఐచ్ఛికం చేసింది. రైతులపై ఎటువంటి ఒత్తిడీ లేదని ఆసక్తి ఉన్న వారే ప్రీమియం చెల్లించుకోవాలని చెప్పడంతో పాటు ఉచిత పంటల బీమా ఎత్తివేసి విపత్తుల సమయంలో రైతులకు ధీమా లేకుండా చేసింది. భారీ వర్షాలు, వరదలతో పంటకు నష్టం వాటిల్లినపుడు రైతులను ఆదుకునేందుకు ప్రతి ఏటా పంటల బీమా పథకం దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈ పసల్ బీమా యోజన ద్వారా ప్రీమియం సొమ్ములో 1.5 శాతం రైతు చెల్లిస్తే ,0.5 శాతం ప్రీమియం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించేవి. రైతుల పంట రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకులే పంటకు బీమా చేయించేవి. ప్రీమియం గడువు సరైన సమాచారం లేకపోవడంతో పంట రుణాల విడుదలలో జాప్యం తదితర కారణాలతో చాలా మంది ప్రీమియం చెల్లించక నష్టపోయేవారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేసినప్పటికీ ప్రైవేట్ బీమా కంపెనీలు రైతులను సాంకేతిక కారణాలు చూపించి రైతులను ఇబ్బందులకు గురి చేసింది. ఎట్టకేలకు రైతుల ఆందోళనల నేపథ్యంలో తిరిగి బీమా చెల్లింపులు వటి ప్రక్రియ జరిగేది. రైతులు చెల్లించాల్సిన ప్రీమియం భారాన్ని ప్రభుత్వమే భరించడంతో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేది. ఈ క్రాప్ ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ ప్రీమియం చెల్లించడం వల్ల ప్రతి ఎకరాకూ బీమా వర్తించేది. పంట నష్టం జరిగినపుడు రైతులతో పాటు కౌలు రైతులకు పరిహారం లభించేది. పంట నష్టపోయిన అనంతరం ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా పరిహారం అందజేసి భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకుంది. కూటమి ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ఎత్తివేయడంతో రైతులే ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు ఇబ్బందులు తప్పలేదు. తొలుత అకాల వర్షాలు, అనంతరం యూరియా కొరత వంటి సమస్యలతో రైతులు సతమతం అయ్యారు. తాజాగా పంటల దిగుబడి చేతికొచ్చిన తరుణంలో మొంథా తుపాను రైతు వెన్ను విరిచింది. అవగాహన లేక ప్రీమియం చెల్లించలేని వారికి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఈ నేపథ్యంలో పంట నష్టపోయిన వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

అత్యాచార ఘటనపై ప్రజాసంఘాల ఖండన

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నేడు నిరసన కార్యక్రమం



కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

ఐ.పోలవరం మండలం బాణాపురంలో బాలికపై జరిగిన అత్యాచారన ఘటనను ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. బాలికల భద్రతకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు అత్యంత హేయమైనవి ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఈ ఘటనను అందరూ ఖండించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాణాపురంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిని నిందితుడు రాయపురెడ్డి సత్య వెంకట కృష్ణ(బాబీ)ని శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి తక్షణమే రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. బాధిత బాలికకు ఉచిత విద్య, బాలిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బాలిక విద్య అనంతరం ప్రభుత్వం ఉద్యోగం కల్పించే చర్యలు ఇప్పుడే చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణను 90 రోజులలో పూర్తి చేసి, నిందితుడికి కఠినమైన శిక్ష విధించాలన్నారు.. అత్యంత సున్నితమైన ఈ కేసు విచారణను పర్యవేక్షించడానికి ఒక ఉన్నత స్థాయి మహిళా అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ దారుణానికి వ్యతిరేకంగా బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న సోమవారం సాయంత్రం 4:30 గంటలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, మేధావులు, మహిళలు, యువ కులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, దళిత ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక తరపున ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శెట్టిబత్తుల తులసిరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్, కార్యదర్శి ఎన్.బలరాం, కోశాధికారి కె.కృష్ణవేణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ఎంటి వి.సుబ్బా రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, జి. గోపాలకృష్ణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు కార్యదర్శి జి.దైవకృప, డి.ఆదిలక్ష్మి, పి.అమూ ల్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామ చంద్రరావు, బుంగ సత్యనారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు కె.సత్తిబాబు, జిల్లా కార్యదర్శి రాజేంద్ర, బొంతురమణ తదితరులు ఉన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించాలి



హైకోర్టు జడ్జి సుమతీ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి జగడం సుమతి సూచించారు. నగర పంచాయతీ పరిధిలో స్థానిక కోర్టు హాలు నందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమానికి జడ్జి సుమతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయ వ్యవస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సేవలను అందించేందుకు 42వ రాజ్యాంగ సవరణ కల్పించింద న్నారు. అనంతరం జడ్జి సుమతీ దంపతులను బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం సివిల్ జడ్జి మహమ్మద్ రహం తుల్లా, అమలాపురం ప్రత్యేక కోర్టు జడ్జి పివి.సత్యనారాయణలతో పాటు బార్ సెక్రటరి మట్టపర్తి సత్య నారాయణ, న్యాయవాదులు రెడ్డి సత్యనారాయణ మూర్తి, కుచ్చర్లపాటి తాతం రాజు, బీర ప్రసాద్ బాబు, కాశి బాబు జగ్జీవన్‌రామ్, తటవర్తి నాగరాజారావు, కాశి సిద్ధార్థకుమార్, తిరుకోటి శాంతి సుధా, రెడ్డి మిత్ర, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్రంథాలయాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలని కమిటీ ఛైర్మన్ వీళ్ల వీరాస్వామి నాయుడు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా గ్రంథాలయ శాఖ కార్యాలయంలో ఆదివారం శాఖ గ్రంథాలయం నిర్వాహకుడు శీలం నాగరాజు అధ్యక్షతన నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరాస్వామి నాయుడు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన గ్రంథాలయానికి సొంత స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. గ్రంథాలయానికి స్థల సేకరణతో పాటు, పక్క భవన నిర్మాణానికి కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కమిటీలో జోగి రాంబాబు (వైస్ ప్రెసిడెంట్), శీలం వెంకట రమణ(సెక్రటరి), పాము నాగేశ్వరరావు(వైస్ సెక్రటరి), సెక్రటరి మరియు కన్వీనర్‌గా శీలం నాగరాజు, సభ్యులుగా టి.సుబ్బారావు, విజయకుమార్, అరిగెల నాగేంద్ర, సబ్బతి సత్యనారాయణ, పోలిశెట్టి కృష్ణలను సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.



సంతకాలు సేకరిస్తున్న చినధనరాజు

రోడ్డు నిర్మించాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

జి.మూలపొలం నుంచి ఎదుర్లంక వరకు ఆర్అండ్‌బి రోడ్డు కోసం యువ నాయకుడు రేవు చినధనరాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రజల వద్ద నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా చినధనరాజు విలేకర్లతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరా లయినప్ప టికీ ఎక్కడ చూసిన శాశ్వతంగా రోడ్లు నిర్మించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జి.మూలపొలం నుంచి ఎదుర్లంక వరకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని రోజుల కిందట ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న ఒక ఆటో తిరగబడటంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గాయాలయ్యాయన్నారు. వారిని ఆసుపత్రికి తరలించటం వల్ల ప్రాణాపాయస్థితి నుంచి బయట పడారన్నారు. ఇక్కడ గోతుల రోడ్లుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించా లని ప్రజలు కోరుతున్నారని అన్నారు. ఈ విషయం పై ప్రజల నుంచి సంతకాలు స్వీకరిస్తున్నామన్నారు. దీనికి కూడా ప్రజాప్ర తినిధులు, అధికారులు నుంచి సమాచారం రాకపోతే త్వరలోనే ప్రజలతో పాదయాత్ర నిర్వహిస్తామని ఆయన అన్నారు.

ఉచిత ఇంటర్ విద్యకు 'మోడరన్' గేట్ వే



మోడ్రన్ కరపత్రం విడుదల చేస్తున్న మంత్రి సుభాష్ లయన్ జివి.రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రతిభావంతులైన పదవతరగతి విద్యార్థులను దత్తత తీసుకుని వారికి ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత ఇంటర్ విద్య అందించేందుకు మోడరన్ కళాశాల ఏర్పాటుచేసిన 'మోడరన్ గేట్ వే 2026-27 కరపత్రాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యాల వంటి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు ప్రయత్నం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో కూడిన ఉచిత ఇంటర్ విద్య అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు మాట్లాడుతూ పేదరికం చదువుకు ఆటంకం కారాదనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో కూడిన ఉచిత ఇంటర్ విద్య అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిలిపివేయాలి



ఎస్.యానం కోటి సంతకాల సేకరణలో డాక్టర్ శ్రీకాంత్ , వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిలిపివేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్.యానంలో మండల వైసిపి అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను అధ్యక్షతన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో అప్పటి సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిం చాలని లక్ష్యంతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నార. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పిపిపి విధానంలో ప్రయివేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీలను కట్టబెట్టేందుకు కుట్ర చేయడం దారుణమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైసిపి జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గెడ్డం కిరణ్ కుమార్, నాయకులు పలచోళ్ళ బాబ్జి, తాడి పండు, రేవు రాజేష్, పెయ్యల రమణ, ముత్తాబత్తుల సురేష్, లంకే చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మొంథా తుపానుకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలో సొసైటీ కార్యాలయం వద్ద ఆదివారం మొంథా తుపానులో తీవ్రంగా నష్టపోయిన 106 కుటుంబాలకు రూ.2.86 లక్షల ఆర్థిక సాయంతో పాటు, ప్రభుత్వం పంపిణీ చేసిన 6 రకాల నిత్యావసర సరుకులను ఎంఎల్ఎ సుబ్బరాజు చేతులు మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వం అప్రమత్తమై ప్రాణనష్టం జరగకుండా యంత్రాంగాన్ని అప్రమటం చేయడమే కాకుండా, భవిష్యత్‌లో ఎటువంటి విపతునైనా ఎదుర్కొనేందుకు బాటలు వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సుభాష్, మండల టిడిపి అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా సత్తిబాబు, యూనిట్ ఇన్‌ఛార్జ్ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఇసుకపట్ల ఈశ్వర్ కుమార్,పళ్ల రాజబాబు, కొప్పిశెట్టి షేట్, గుద్దటి జమ్మి, గోదాసి పుండరిష్, చిక్కాల అంజిబాబు, యలమంచిలి బాలరాజు, బద్రి రామ లతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాలు

అమలాపురం రూరల్: మొంథా తుపాను బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను ఆదివారం సవరపాలెంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ పరమట చిట్టిబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 16 మంది పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందారని, ఆ 16 మందికి ఆర్థికసాయం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, టిడిపి బూత్ కమిటీ సత్తి అనిల్, టిడిపి గ్రామ కమిటీ సత్తి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, రెవెన్యూ అధికారి రాజేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సవరపాలెంలో సాయం అందిస్తున్న సర్పంచ్, ఎఎంసి వైస్ చైర్మన్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు సత్కారం




ఎంఎల్ఎ సత్యానందరావును సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆలమూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇటీవల కాలంలో అతలాకుతలం చేసిన మొంథా తుపాను సహాయక కార్యక్రమాలలో విశేషమైన సేవలు అందించి, పునరావాస బాధితులకు అండగా నిలిచిన కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలమూరు మండల యుటిఎఫ్ శాఖ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లోకేష్, నాయకులు వైవివి.రమణ, పివివిజిఎస్ఎన్.మూర్తి, ఎన్.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎ బండారును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువా కప్పి, వెంకటేశ్వర స్వామి మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు.

కార్టూ'నిజం'



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కొమరగిరిలో రాజ్యాంగ పరిరక్షణ సమితి ర్యాలీ

ప్రజాశక్తి- ఐ.పోలవరం

పౌర హక్కులను కాపాడే రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని నియోజకవర్గ రాజ్యంగ పరిరక్షణ సమితి పేర్కొంది.మండలంలోని కొమరగిరి పంచాయతీ పరిధిలోని గట్టువారిపేట, రామారావుపేట గ్రామంలో ఆదివారం గడప గడపకు భారత రాజ్యాంగం అనే కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం మచ్చా శ్రీనివాసరావు అధ్యక్షతన సదుస్సు నిర్వహించారు.కమిటీ అధ్యక్షులు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, మహిళలు తమ హక్కులను తెలుసుకుని రాజ్యాధికారకాంక్ష దిశగా అడుగులు వేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలపై నిత్యం జరిగే దాడులను తిప్పి కోటాలంటే ఆయా వర్గాలు రాజ్యాధికారసాధనకు ఐక్యం కావాలన్నారు. విద్యావం తులైనపుడే మార్పు సాకరమౌతుందన్నారు. బడ్జెట్లో షెడ్యూల్ కులాలకు నిధులు కేటాయించడం, వాటిని వేరే పనులకు మళ్లించడం జరుగుతోందన్నారు. ఎస్‌సి గ్రామాల్లో నేటికీ విద్యతో పాటు, నివాసాలు, శ్మశానవాటికులు, తాగునీరు, డ్రెయినేజీలు, రహదారులు వంటి మౌలిక వసతులు లేకపో వడం నిదర్శనం అన్నారు. రిజర్వేషన్లు ద్వారా ఉద్యోగాలు పొందిన వారు గ్రామాల్లో రాజ్యాంగం, అంబేద్కర్ ఆలోచన విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సురేష్, కుంచే చినబాబు, జంగా చిట్టిబాబు, శరత్, రమేష్, తాటిపాక దుర్గబాబు, తాడి సుభాష్, ఉండ్రు శ్రీనివాసరావు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



అమలాపురంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అమలాపురం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడవడిక కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కౌన్సిలింగ్ కార్యక్రమాలు చేపట్టారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీట్ రద్దు చేయకుండా మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నేరాల వల్ల కలిగే పర్యవసానాలు, వాటి కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే సమస్యల గురించి వారికి అవగాహన కల్పించారు. జీవితంలో సానుకూల మార్పు తీసుకురావడానికి ఉన్న అవకాశాలు, ఉపాధి మార్గాలు వారికి వివరించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

జాగ్రత్తలే ఉద్యాన వన పంటలకు రక్షణ

'ప్రజాశక్తి'తో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి టివి.సిరిల్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మొంథా వంటి తుపానులు వచ్చినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉద్యాన పంటలకు నష్టం జరగకుండా నివారించుకోవచ్చునని జిల్లా ఉద్యాన వన అధికారి టివి.సిరిల్ అన్నారు. అరటికి భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అరటి పంటను రైతులు తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటే పూర్తిగా పంటను రక్షించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అరటి సంరక్షణపై పలు అంశాలను వివరించారు.

నీటిని ఎంతవరకు ఉపయోగించాలి.?

అరటి తోటల్లో మురుగునీటి వసతి కల్పించి, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పంట పది గంటలకు మించి ముంపునకు గురయితే అధిక శాతం మొక్కలు చనిపోయే అవకాశం ఉంది. అందువల్ల ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి. పంట తేరుకోవడానికి లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి అదనంగా 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. తోటలో ఆరుదల వచ్చేలా చూడాలి. ట్రైకోడేరా విరిడి జీవ నియంత్రకాన్ని ఎకరానికి 2 కిలోల చొప్పున 100 కిలోల పశువుల ఎరువుతో కాని, వర్మి కంపోస్ట్ కాని కలిపి చల్లుకోవాలి.

నీటిలో మునిగితే సంరక్షణ చర్యలు తీసుకోవాలి.?

మూడు నెలలు కంటే చిన్న వయసు గల మొక్కలు 4-5 రోజులపాటు 2-3 అడుగుల లోతు నీటిలో మునిగినప్పుడు వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్ళిపోయే ప్రమాదముంది. నీరు లాగిన వెంటనే మొక్కలను తీసివేసి, నేల ఆరిన తరువాత తేలికపాటి దుక్కి చేసి, ఎంపిక చేసిన రకానికి సిఫారసు చేసిన దూరంలో 45-45-45 సెం.మీ పొడవు, వెడల్పు, లోతు గల గుంటలు తీసి టిష్యూ కల్చర్ (లేదా) విత్తన శుద్ధి చేసిన తెగుళ్ళ లేని సూది పిలకలను మళ్లీ నాటుకోవాలి. ఐదారు నెలల వయసు ఉండి గెలలు వేసే దశలో ఉన్న మొక్కలు ఉన్న తోటల్లో ఐదు రోజుల కంటే ఎక్కువగా, 3 అడుగుల నీటి లోతులో ఉన్న మొక్కల వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతుంది. ఈ మొక్కలు నీరు ఆరిన తరువాత కూడా బతకడం కష్టం. ఐదు రోజుల కంటే తక్కువగా నీటి ముంపునకు గురి అయినప్పుడు వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది.

వర్షాల సమయంలో తెగుళ్లు ఆశిస్తాయా.?

గాలిలో అధిక తేమ కారణంగా తెల్ల చక్కెర కేళి, గ్రాండ్‌నైన్, వామన కేళి వంటి రకాలలో సిగటోకా ఆకుమచ్చ తెగులు అధికంగా ఆశించడానికి అవకాశం ఉంది. నేలలో అధిక తేమ వలన బ్యాక్టీరియా దుంప కుళ్లు ఆశించవచ్చు.

తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి.?

సాధ్యమైనంత త్వరగా ముంపు నీటిని మురుగునీటి కాల్వల ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేయాలి. నేల ఆరిన తరువాత అంతర సేద్యం చేసి మొక్క ఒక్కింటికి 100 గ్రా యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20-25 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 దఫాలు వేయాలి.

ఏయే మందులు ఎన్నిసార్లు పిచికారి చేయాలి.?

ఆకులు తడిసేలా ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఒక లీటరు నీటికి చొప్పున తగినంత జిగురు కలిపి వారంరోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలి. సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి జిగురుతో పాటు పిచికారీ చేయాలి. అరటి దుంపలు కుళ్లిపోకుండా నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి లేదా బోర్డో మిశ్రమం 1 శాతం దుంప చుట్టూ తడిసే విధంగా పోయాలి.

దుంపకుళ్ళు ఆశిస్తే ఏం చేయాలి.?

దుంపకుళ్లు ఆశించిన మొక్కలను గమనించి, వాటి చుట్టూ 25 గ్రాముల బ్లీచింగ్ పొడి ఒక లీటరు నీటిలో కలిపి మొదలు తడిసేలా పోయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తర్వాత మళ్లీ పోయాలి. తర్వాత ఈ మొక్కల మొదళ్లలో 50 గ్రాముల సూడోమోనాస్, 250 గ్రాముల వేపపిండితో కలిపి వేయాలి.



పూర్తిగా గెలలు విడిచిన, 75 శాతం లోపల గెల తయారీకి వచ్చిన దశలో ఉన్న తోటల్లో ముంపునీరు వల్ల వేరు వ్యవస్థ పాక్షికంగా (లేదా) పూర్తిగా దెబ్బతింటుంది. దీనివలన గెల తయారీకి అవసరమైన నీరు, పోషక పదార్థాలు మొక్క తీసుకోలేదు, తద్వారా గెల పూర్తిగా తయారవ్వకుండా, పక్వానికి వచ్చి నష్టం కలుగుతుంది.

ముంపునీటి సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలి.?

ముంపు నీటిని సాధ్యమైనంత త్వరగా తోట నుంచి బయటకు పంపి భూమి ఆరే విధంగా చేయాలి. ఆకులు, గెలలు బాగా తడిసే విధంగా లీటరు నీటికి ఐదు గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఎరువులను వెంటనే మూడు రోజుల వ్యవధిలో మూడుసార్లు ఒక దాని తరువాత మరొకటి పిచికారీ చేసుకోవాలి. గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పివుంచి 15 రోజులలో మార్కెట్ చేసుకోవాలి. వెదురు కర్రతో ఊతమిచ్చి మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. నేలలో మొక్క చుట్టూ గాడిలో 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యురియేట్ అప్ పోటాష్ వేసుకోవాలి.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట శివారు చక్రవర్తి నగర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ బద్వానీ జిల్లా చాంద్యా గ్రామానికి చెందిన సంజయ్ జాట్(30) వరి కోత మిషన్ పై డ్రైవర్గా పనిచేస్తున్నాడు. మోటార్ సైకిల్పై వస్తుండగా అతనిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మతి చెందాడు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ శివాజగ్గు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యాన్ ఢీకొన్న ఘటనలో..

ప్రజాశక్తి -దేవరపల్లి

దుద్దుకూరు జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రంగారావు కాలనీ బంధపురం గ్రామానికి చెందిన వికలాంగుడు షేక్ హుస్సేన్ (50) బైకుపై వెళుతుండగా వ్యాన్ ఢీకొన్న సంఘటనలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

సారా, మద్యం బాటిల్స్ స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని సారా, బెల్లం ఊట, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ కె.కాత్యాయని తెలిపారు. వివరాలు ఇవి.. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అప్పారి శ్రీనును ఆరు లీటర్ల నాటుసారా మరియు 500 లీటర్ల బెల్లం ఊట తోను, అదేవిధంగా కొత్తపేట మండలం పలివెల గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పిల్లా వెంకటేశ్వరరావు వద్ద 180 మి.లీ ఏడు మద్యం బాటిళ్లతో అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో ఎస్ఐ కె.అన్నవరం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి- తాళ్లపూడి

తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన తాళ్లపూడికి చెందిన గూడా విజయరాజుకు అన్నదేవరపేట రెవెన్యూ పరిధిలో కొంత భూమి ఉంది. ఈ భూమితో పాటు విజయరాజు ఆధీనంలో ఉన్న మరో నాలుగు ఎకరాల్లో జామాయిల్ పండిస్తుండగా షణ్ముఖం వెంకటేశ్వరరావు, వెలుగుబంటి రామకృష్ణ, షణ్ముఖం ఆనంద్ సుమారు రూ.రెండున్నర లక్షల విలువైన జామాయిల్ పంట కోసుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరల పంట కోయడానికి వచ్చిన సమయంలో తాను అడ్డుకోవడంతో కులం పేరుతో దూషించడమే కాక చంపుతానని బెదిరించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొవ్వూరు

గత నెల 25వ తేదీ నుంచి చల్లా భాస్కరరావు అనే వ్యక్తి కనిపించడం లేదని ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ముక్కు మండలం నాయుడువలసకు చెందిన భాస్కర్ రావు తన గ్రామానికి చెందిన 18 మంది కూలీలతో బంగారమ్మపేటలో రైస్‌మిల్లులో పని చేసేందుకు వచ్చాడు. గత నెల 25న ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదన్నారు. దీంతో ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సిఐ తెలిపారు. వివరాలు తెలిసినవారు 944079662 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బలవంతపు పెళ్లిపై విద్యార్థిని ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో మునికూడలికి ఒక విద్యార్థినిపై ఆరుగురు వ్యక్తులు బలవంతంగా దాడి చేసి, బెదిరించి వివాహం జరిపించినట్టు ఆదివారం జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. బి.టెక్ చదువుతున్న ఒక విద్యార్థిని ఇంటికి గత నెల 10న ఆమె స్నేహిడుతు వచ్చాడు. ఆ సమయంలో పేటలోని చిడిపి స్టాలిన్, అనిమెల్లి సురేష్, కొడమంచిలి సుబ్బారావు, కొడమంచిలి తేజ, ఆనిమెల్లి సుధాకర్, అనిమెల్లి నాగేంద్ర విద్యార్థిని, ఆమె స్నేహితునిపై దాడి చేశారు. అనంతరం విద్యార్థిని మెడలో బలవంతంగా తాళి కట్టించారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ కేసునమోదు చేశారు.

ట్రావెల్స్ బస్సు సీజ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కర్నూలు ట్రావెల్ బస్ ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయి. మండలంలోని అన్నంపల్లిటోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ప్రమాణాలు సక్రమంగా లేని జయంతి ప్రయివేటు ట్రావెల్స్ బస్సుపై కేసులు నమోదు చేసి సీజ్ చేశామన్నారు. ఇప్పటివరకు 57 బస్సులను తనిఖీ చేసి, ప్రమాణాలు పాటించని ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేయడమే కాకుండా, ఫిట్‌నెస్ రద్దు చేశామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన ఎనిమిది బస్సులలో అనధికారికంగా సీట్ల మార్పిడి చేసినట్లు గుర్తించామని, ఇది మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన క్రింద మూడు బస్సులను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన బస్సులు యానాం నుంచి హైదరాబాద్‌కి నిత్యం తిరుగుతున్నా యని, ఇకపై తనిఖీలను ముమ్మురం చేస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రామచంద్రపురం



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభలో మంత్రి సుభాష్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. జిఎస్‌టి తగ్గింపుతో కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగానికి, భవన నిర్మాణ కార్మికులకు మేలు చేసిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి తగ్గించి భవన నిర్మాణ వ్యయం తగ్గించాయన్నారు. సిమెంటుపై పది శాతం, ఫ్లోరింగుపై ఏడు శాతం, మార్బుల్స్, గ్రానైట్, ఇసుక, ఇటుకలపై ఏడు శాతం జిఎస్‌టి తగ్గించిందని వివరించారు. తద్వారా ద్వితీయ శ్రేణి నగరాల్లో 1000 చదరపు అడుగుల ప్లాటు నిర్మాణం వ్యయం రూ.30 లక్షలు అయితే, జిఎస్‌టి తగ్గింపు కారణంగా నిర్మాణదారుకు రూ.1,37,000లు ఖర్చు తగ్గుతుందన్నారు. నిర్మాణ రంగ ఖర్చులు తగ్గించి నూతన నిర్మాణాలకు ప్రోత్సాహం కల్పించిన కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వినియోగదారులకు తక్కువ ఖర్చుతో లాభం, భవిష్యత్తుకు మేలైన పెట్టుబడి పెట్టుకునే అవకాశం లభిస్తుందన్నారు.

రవికుమార్ దీక్షకు పలువురి సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమెల్లి రవికుమార్ చేపట్టిన నిరవధిక దీక్షకు ఆదివారం పలువురు సంఘీభావం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష ఆదివారం 23 రోజుకు చేరుకుంది. ఆర్‌టిసి అధికారులు స్పందించకపోవడంతో రవికుమార్ నిరవధిక దీక్షను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ప్రయోజ నాలకు నష్టం కలిగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రయాణికులు, విద్యార్థు లు, మహిళలు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా బస్టాండ్‌లోనే బస్సులు ఎక్కి, దిగే విధంగా మౌలిక సౌకర్యాలు కల్పించి, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌లో 24 గంటలు బస్సులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని 22 రోజులుగా దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడంతో నిరవధిక దీక్ష చేపట్టానన్నారు. ఇప్పటికైనా అధికారులు బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరిం చాలని డిమాండ్ చేశారు. సంఘీభావ దీక్షలో పోతుల సుందరరావు, గోడి సత్యనారాయణ, యలమంచిలి బాలరాజు, గిడ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దాతలకు బాలబాలాజీ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన సురింది వీర వెంకటరావు, కుమారి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఆదివారం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,01,111 విరాళం అందజేశారనిఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. దాతలు ముందుగా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి, అలయ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి రూ.20 వేలు..

ప్రజాశక్తి - అయినవిల్లి



స్వామి వారి చిత్రపటంతో దాతలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన పువ్వల నాగ సాయి ఉమా మహేశ్వర రావు, కుటుంబ సభ్యులు దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాననిధికి రూ.20,106 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్‌రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటమును బహుకరించారు.

మగటపల్లిలో శానిటేషన్

ప్రజాశక్తి - మామిడికుదురు

తుపాను భారీ వర్షాలు ప్రభావితంతో మగటపల్లి లోఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర గా సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో ఒకటవ వార్డు నుంచి ఆదివారం చేపట్టిన శానిటేషన్ పనులను చేపట్టారు. ఉప సర్పంచ్ మట్ట గంగయ్య తదితరుల పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పరిసరాలన్ని పరిశుభ్రం చేయించి గ్రామమంతా బ్లీచింగ్ చల్లిస్తున్నమని వారు తెలిపారు. దోమల నిర్మూలనకు నీరు నిలవన్న ప్రాంతాల్లో ఏబేట్ మందు స్ప్రే చేయించామన్నారు. గ్రామస్తులంతా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

మందకృష్ణ వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - ఐ.పోలవరం

పాతఇంజరం గ్రామ పంచాయతీ వద్ద మండల మాల మహానాడు అత్యవసర సమావేశం ఆదివారం మండల అధ్యక్షులు రేవు శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇటీవల ఒక సమావేశంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురించి మాట్లాడిన వ్యాఖ్యలను మాల మహానాడు ఖండించింది. ముందుగా అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. అంబేద్కర్ గురించి అవమానకరంగా మాట్లాడినందుకు ఐ.పోలవరం పోలీసుస్టేషన్‌లో మంద కృష్ణపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమ ంలో వడ్డి గౌతం, జనిపల్లి విప్లవ కుమార్, మట్టా గగన వీరుడు, పండు విజయ్‌కుమార్, బీర సత్యనారాయణ, గుత్తాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదం లో సర్వస్వం కోల్పోయిన వల్లెం భాస్కరరావు కుటుంబాన్ని టిడిపి నాయకులు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు తన వంతు సహాయంగా రూ.5వేలు, రగ్గులు దుప్పట్ల, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం గోదావరిలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి కొట్టుకుపోయిన పెమ్మాడి నూకరాజు (40) కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పంపన నాగమణి సుబ్బారావు, ప్రెసిడెంట్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, మానే చిన్న, సాయిబాబు, అమర్నాథ్, అడపా కృష్ణ, అయినవిల్లి సూరిబాబు, అగ్నికుల క్షత్రియులు పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి గ్రామాధ్యక్షుడు ప్రేమానందం మృతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి వైసిపి గ్రామ అధ్యక్షులు నల్లి ప్రేమానందం(69) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన జయపేటలో స్వగృహం నందు మృతి చెందారు. ఇటీవలే ఆయన భార్య మృతిచెందిందని బంధువులు తెలుపుతున్నారు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ పని చేసి రిటైర్డ్ అయిన అనంతరం అయన రాజకీయాల్లో చేరి వైసిపిలో గ్రామంలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. మృతుడు ప్రేమనందంకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యా దులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడా నికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ డానికి 'మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్' వెబ్‌సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసు కోవచ్చన్నారు. పిజిఆర్ఎస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

జోగి రమేష్ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - మండపేట

కల్తీ మద్యం కేసులో వైసిపి నేత మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్‌ను రాష్ట్ర సబార్డినేట్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఖండించారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కప్పిపుచ్చుకోవడానికి తీసుకునే చర్యగా ఉందని ఆయన అన్నారు. ఆదివారం మండపేట విజయలక్ష్మి నగర్లో వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు 18 నెలలు కావచ్చిందని పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో మాజీమంత్రి జోగి రమేష్‌ను అరెస్టు చేయడాన్ని బట్టి చూస్తే వైసిపి నాయకులను అక్రమ కేసులు నమోదు చేసి కక్ష సాధింపు చర్య చేపడుతున్నట్లుగా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ. రాజబాబు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులు చేపట్టిన ఎన్ ఎస్ ఎస్ సేవా విభాగం విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - మామిడికుదురు

మాకన పాలెం, కొమరాడ గ్రామాలలో దీప్తి జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏడు రోజుల సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజైన ఆదివారం ప్రధాన రహదారుల ఇరువైపులా చెత్తాచెదారం తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారని కళాశాల కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే, పరిసరాల పరిశుభ్రత తో పాటు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు దీపాటి సురేష్, ఎస్.నాగమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆపీసర్స్ పి.సుబ్బారావు, వి.కొండలరావు, ఎన్.ఈశ్వర రావు, వి.నాగరాజు, రెండు కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు

వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - అమలాపురం

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామిఆలయంలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన యాత్రికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ అమలాపురంలో ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో అమలాపురం అసెంబ్లీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, ముమ్మిడివరం మాజీ ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్, గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంఎల్‌సిలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the III Additional District Judge, Kakinada
O.S. No. 79/2025

Between:
Smt. Yeluri Sirisha and another ...*Plaintiffs*
AND
Yeluri Naga Hari Krishna & others ...*Defendants*

To: ***Defendant No-4:***
Ardhani Ravi Kumari, W/o. Sri Venkata Sitaramaraju, D.No. 1-2-7/3, Kondayyapalem, Kakinada.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 17-11-2025 సం။రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేగుళ్ళ వెంకట రమణమూర్తి
అడ్వకేట్, గాంధీనగర్
కాకినాడ, సెల్: 9866033899

In the Court of the V Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 171/2025

Between:
Nagaramani Srinivas ...*Plaintiff*
AND
Palacharla Manideep & another ...*Defendants*

To: ***Defendant No-2:***
Palacharla Kasiviswanatham, S/o. (late) RamaRao, Employee, D.No. 6-125, Palacharlavari Street, Pedapudi, Pedapudi Mandal, Kakinada District.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 25-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
NAKKINA MALLIKARJUNA RAO
Advocate, Kakinada
Cell: 9848913888

వేలం ప్రకటన
మహారాజశ్రీ కాకినాడ 5వ అ॥ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 139/2023 in O.S. 1126/2019

Between:
Gummella Chakrababu ...*Decree Holder*
AND
Kaldari Saraswathi ...*Judgement Debtor*

పై నెంబరు కేసులో పైన తెలిపిన Judgement Debtor తాలూకు యీ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారి ఎదుట **ది. 11-11-2025వ సం॥రం తేదీని పగలు 10.30 ని॥** లగాయితు వేలం వేయబడును. కావున పాడుకొనదలచిన వారు పూర్తి వివరములకు పై కోర్టు వారి నాజరు వారి ఆఫీసు వద్ద గాని, డిక్రీ హోల్డరు తాలూకు ప్లీడరు గారి ఆఫీసు వద్ద గాని సంప్రదించవలెను.

వేలం కాబడు ఆస్తి వివరం

Previously East Godavari District at present Kakinada District, Kakinada Rural Mandal, Samalkota Sub Registry, Penumarthi Village, Zeroyati dry land in S.No. 14/1, land to an extent of Ac. 2.15 cents on North is an extent of Ac. 8.53 cents on North ina full extent of Ac. 14.56 cents situated within the following boundaries.

EAST: Ummadi Punta. **WEST:** Murugu Kaluva. **NORTH:** Land of Kaldari Apparao @ Nallabbi and Others. **SOUTH:** Land of Penkey Kannayya.

DHr's value is Rs. 60,00,000/-
Amin's value is Rs. 1,00,00,000/-
JDr's value is not given

KAMUJU SRINIVASA RAO
Advocate for Decree Holder
Kakinada Kakinada
Dt:31-10-25 Cell: 9908265647

మహారాజశ్రీ తణుకు 1st అడిషినల్ జూనియర్ సివిల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P.54 of 2023 in O.S.No.436 of 2016

Between:
Smt.Bathina Pushpa ...Petitioner(D.H.R)
And
Smt. Rajala Santha Kumari W/o.Late అంబేద్కర్, Opp.లూథరన్ చర్చ్, కల్దారి, ఉండ్రాజవరం మండలం ...Respondent(J.D.R)

డి.హెచ్.ఆర్.దాఖలు చేసిన ప్రకటన

పై నెంబర్ గ్రంథంలో మీరు జెడిఆర్ అయివున్నారు. మీరు ఎన్నిసార్లు నోటీస్లు కట్టినప్పటికి మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు మీకు నోటీసు అమలు నిమిత్తం పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు. కావున మీరు 18-11-2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ముందు మీరు స్వయముగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న తెలియచేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమునా పైకోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

ఐనంపూడి కామేశ్వరరావు
ఐనంపూడి శ్రీదేవి కృష్ణవేణి
Tanuku
01-11-2025 అడ్వకేట్, తణుకు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్)వారి కోర్టులో
E.P.No.60/2011 O.S.No.81/2005

Between:-
Kotak Mahindra Bank, Kakinada, rep.by. it'sManager ...**DHR/వాది**
Vs
Jampana Suryanarayana Raju & వగైరాలు **JDR's/ప్రతివాదులు**

పై నెంబరు డిక్రీ ప్రకారం వాది/ Dhr's కు సదరు పైన చెప్పిన Jdr's వల్ల రావలసిన డిక్రీ బాకీ మొత్తమును రాబట్టుకొనుటకు రెస్పాండెడ్స్/Jdr's తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిపై శ్రీ కోర్టు వారి ఎదుట **ది.24-11-2025వ** తేదీన **ఉదయం10:30గంటల** లగాయతు వేలం వేయబడును. కావున ఆసక్తి గల పాటదారులు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి 1/4వ వంతు దరావత్తు సొమ్ముతో వేలం పాట పాడుకొనవచ్చును. వివరములకు Dhr/వాది గారి ప్లీడరును గాని శ్రీ కోర్టు వారి అమీనాని గానీ సంప్రదించి పాట షరతులను తెలుసుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరం

పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం సబ్ రిజిస్ట్రీ, ఐ.పోలవరం మండలం, కొమరగిరి గ్రామం తాలూకు జిరాయితీ పల్లం
Item 2) R.S.No.167/6 పురా ఎ 0.84 సెంట్లు
Item 3) R.S.No.167/9 పురా ఎ 0.19 సెంట్లు
DHR Value 2 Items వెరసి రు.4,00,000/-
అమీనా విలువ:2 Items వెరసి రు.38,00,000/-

కళా వెంకట్రావు
అమలాపురం DHR తరపుఅడ్వకేట్,అమలాపురం
02-11-2025 సెల్: 9440147955

వేలం ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్)వారి కోర్టులో
E.P.No.62/2011 O.S.No.83/2005

Between :-
Kotak Mahindra Bank, Kakinada, rep.by. it'sManager ...**DHR/వాది**
Vs
పెనుమత్స జగ్గరాజు & వగైరాలు **JDR's/ప్రతివాదులు**

పై నెంబరు డిక్రీ ప్రకారం వాది/ Dhr's కు సదరు పైన చెప్పిన Jdr's వల్ల రావలసిన డిక్రీ బాకీ మొత్తమును రాబట్టుకొను టకు రెస్పాండెడ్స్/Jdr's తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిపై శ్రీ కోర్టు వారి ఎదుట **ది.24-11-2025వ** తేదీన **ఉదయం10:30గంటల** లగాయతు వేలం వేయబడును. కావున ఆసక్తి గల పాటదారులు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి 1/4వ వంతు దరావత్తు సొమ్ముతో వేలం పాట పాడుకొనవచ్చును. వివరములకు Dhr/వాది గారి ప్లీడరును గాని శ్రీ కోర్టు వారి అమీనాని గానీ సంప్రదించి పాట షరతులను తెలుసుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరం

పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, పశువుల్లంక గ్రామం తాలూకు జి పల్లం ఆర్ ఎస్ నెం.163/5 లో పురా ఎ 0.69సెంట్లు
DHR Value: రు.4,00,000/-
అమీనా విలువ:రు.13,80,000/-

కళా వెంకట్రావు
అమలాపురం DHR తరపుఅడ్వకేట్,అమలాపురం
02-11-2025 సెల్: 9440147955

వేలం ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్)వారి కోర్టులో
E.P.No.61/2011 O.S.No.82/2005

Between:-
Kotak Mahindra Bank, Kakinada, rep.by. it'sManager ...**DHR/వాది**
Vs
పెనుమత్స సత్యనారాయణ రాజు & వగైరాలు **JDR's/ప్రతివాదులు**

పై నెంబరు డిక్రీ ప్రకారం వాది/ Dhr's కు సదరు పైన చెప్పిన Jdr's వల్ల రావలసిన డిక్రీ బాకీ మొత్తమును రాబట్టుకొను టకు రెస్పాండెడ్స్/Jdr's తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిపై శ్రీ కోర్టు వారి ఎదుట **ది.24-11-2025వ** తేదీన **ఉదయం10:30గంటల** లగాయతు వేలం వేయబడును. కావున ఆసక్తి గల పాటదారులు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి 1/4వ వంతు దరావత్తు సొమ్ముతో వేలం పాట పాడుకొనవచ్చును. వివరములకు Dhr/వాది గారి ప్లీడరును గాని శ్రీ కోర్టు వారి అమీనాని గానీ సంప్రదించి పాట షరతులను తెలుసుకొనవచ్చును.

వేలం ఆస్తి వివరం

పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, పశువుల్లంక గ్రామం తాలూకు జిరాయితీ పల్లం ఆర్ ఎస్ నెం.33/1A లో పురా ఎ1.90 సెంట్లు
DHR Value: రు.4,00,000/-
అమీనా విలువ:రు.38,00,000/-

కళా వెంకట్రావు
అమలాపురం DHR తరపుఅడ్వకేట్,అమలాపురం
02-11-2025 సెల్: 9440147955